క్లుప్తంగా

రోడ్డుపై పడిన చెట్ల తొలగింపు



పాన్‌గల్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్లు నెలకొరిగి ప్రధాన రోడ్డుకు అడ్డుగా పడ్డాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మంగళవారం ఈ విషయాన్ని గమనించిన పాన్‌గల్ ఎస్‌ఐ వేణు తన సిబ్బందితో కలిసి రోడ్డుకు అడ్డుగా పడిన పలు చెట్లను తొలగించి వాహనదారుల ఇబ్బందులను తొలగించారు. దీంతో పలువురు ప్రయాణికులు పోలీసుల సేవలను అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి



కొత్తకోట రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు వారి నుంచి నగదు, మూడు సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సంకిరెడ్డిపల్లి శివారులో కొంతకాలంగా పేకాట ఆడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడి చేయగా రాజేష్ రెడ్డి, కుమ్మరి సత్యం, రాజుగౌడ్ దొరికారు. వారి నుంచి రూ.17,400 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న మరికొందరు పేకాటరాయుళ్లు పారిపోరిపోయారని, వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి ఎద్దడి తీర్చండి



చిన్నంబావి: మండలంలోని వెల్టూరులోని ఎస్సీ కాలనీలో రెండు, మూడు నెలల నుంచి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీఓ రమణరావు దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న ఆయనను కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి తాగునీటి సమస్య ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన లాభం లేకపోయిందని బోరు ద్వారా నీరు అందడం లేదని కొత్త బోరును డ్రిల్లింగ్ చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ సానుకూలంగా స్పందించి, తక్షణమే తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాష్ పరమాళ్ల, రవికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 చెల్లించాలి

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఏఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పుడంపల్లిలో ఉపాధిహామీ కూలీలతో సమావేశమయ్యారు. గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును కుదిస్తూ వస్తుందని మండిపడ్డారు. పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలని, 200 రోజుల పని కల్పించడంతో పాటు పనిప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌పార్టీతోనే దళితులకు మేలు



పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీతోనే దళితులకు న్యాయం జరుగుతుందని పార్టీ దళిత సంఘాల జిల్లా నాయకులు రామస్వామి, వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నారంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా.మల్లు రవికి మద్దతుగా ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీల కోసం సబ్‌ప్లాన్ కింద ప్రత్యేక నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మోసం మాటలు నమ్మకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే రాష్ట్రంలోని ప్రభుత్వంతో కలిసి అనేక అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. కాలనీలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వహీద్, రాముడు, బంగారయ్య, ఆనంద్, గోవర్ధన్, రవి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు భానుడి సెగ



మాందాపూర్‌లో ఒండ్రు మట్టి తరలిస్తున్న కూలీలు

- వేసవి భత్యం చెల్లించాలంటున్న ఉపాధి కూలీలు
- పని ప్రదేశంలో వసతులు కరువు

పాన్‌గల్: భానుడి భగభగతో ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటలకే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో పనిచేసే చోట అరకొర వసతులతో ఉష్ణోగ్రతలకు తట్టుకోలేకపోతున్నారు. ఎండల తీవ్రతతో కూలీలు ఉదయం 7 గంటలకే పనులకు వెళ్తున్నారు. పనులు పూర్తయి యాప్‌లో ఆన్‌లైన్ హాజరు నమోదయ్యేటప్పటికి 11 గంటలు దాటుతోంది. సాయంత్రం వేడి వాతావరణం, వడ గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మండలంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు సెల్సియస్ దాటి ఉష్ణోగ్రతలు నమోదువుతుండటంతో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు.

వసతులు కరువు

నిబంధనల ప్రకారం ఉపాధి పని ప్రదేశాల్లో సేద తీరేందుకు నీడ సౌకర్యం కల్పించాలి. తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రాథమిక వైద్యానికి కిట్లు అందించాలి. అరకొర నీటి క్యాన్ల ఏర్పాటుపై కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక కిట్ల జాడేలేదు. పంట కాల్వలు, చెరువుల పూడిక తీత, చెట్లు నరికివేత వంటి పనులు చేసే ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించేలా సిబ్బందికి అవగాహన కల్పించాలి.

మండలాల వారీగా కూలీల వివరాలు..		
మండలం	జాబుకార్డులు	కూలీల సంఖ్య
పాన్‌గల్	13,755	8,416
చిన్నంబావి	9,563	6,773
వీపనగండ్ల	9,341	6,381

అమలుకు నోచుకోని ప్రమాద బీమా

అధిక ఉష్ణోగ్రతల కారణంగా పని ప్రదేశాల్లో విష పురుగులు, కందిరీగలు వంటివి దాడి చేసే అవకాశాలెక్కువ. ప్రమాద బీమా రూ.10 లక్షల వరకు వర్తింపజేయాలన్న కూలీల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోవాలి. గతంలో ప్రతి కూలీకి వేసవి భత్యం చెల్లించేవారు. తాగునీరు, పరికరాలు, దూర ప్రాంతాలకు రవాణా చార్జీ అందించేవారు. మూడేళ్లుగా వీటికి కోత విధించడంపై లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఏటా కేంద్ర ప్రభుత్వం కూలీ రేటు పెంచుతుంది. అవేమీ పనికి తగిన ఫలితా నివ్వడం లేదన్నది కూలీల వాదన. ప్రస్తుతం రోజు కూలీ రూ.300కు పెంచినా ఖాతాల్లో మాత్రం రూ.200 నుంచి రూ.250 మధ్యే జమవుతోందని కూలీలు వాపోతున్నారు.

కూలి డబ్బులు చెల్లించాలి



ఉపాధి పనులకు వచ్చే కూలీలకు కూలి డబ్బులు ఖాతాల్లో రెగ్యులర్‌గా జమ కాక ఇబ్బందులు పడుతున్నాం. మూడు వారాలుగా కూలీ డబ్బులు జమ కాలేదు. దీంతో పాటు పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాలి. కూలీలకు పెరిగిన కూలీ జమ అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలి.

– గాలెన్న, ఉపాధి కూలీ, పాన్‌గల్

వేసవి భత్యం ఊసేలేదు



తీవ్రమైన ఎండల ప్రభావంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గతంలో కూలీలకు చెల్లించే విధంగా వేసవి భత్యాన్ని చెల్లించాలి. ప్రతి కూలీకు 200 రోజులు పని కల్పించాలి, పనిముట్లు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. రోజు కూలీ రూ.600 చెల్లిస్తూ కూలీ డబ్బులు రెగ్యులర్‌గా అందేలా చర్యలు తీసుకోవాలి.

– సూర్యవంశం రాము, సీఐటీయూ జిల్లా నాయకులు, బుసిరెడ్డిపల్లి

వసతులు కల్పించాం



వేసవి దృష్ట్యా పనులకు వచ్చే కూలీలకు పని ప్రదేశంలో అవసరమైన వసతులను ఏర్పాటు చేశాం. ఉదయం 7 నుంచి 11.30గంటల వరకు పనులు చేయాలని కూలీలకు సూచించాం. పనుల జరిగే ప్రాంతంలో కూలీలకు నీడ కోసం నెట్లు, నీటి వసతి, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాం. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవు.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై చర్చలు

వీపనగండ్ల: తమ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని వల్లభాపురం రైతులు జిల్లా అధికారులు దృష్టికి తీసుకుపోగా.. మంగళవారం డీపీఎం అరుణ, ఏపీఎం బిక్షన్న గ్రామంలోని రైతులు, మహిళా సంఘ సభ్యులతో చర్చించారు. కాగా గ్రామంలో కొందరు కొనుగోలు కేంద్రాన్ని మహిళా కేంద్రాలకు అప్పగించాలని కోరుతుండగా.. మరికొందరు సింగిల్‌విండో ద్వారా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో రైతులతో మాట్లాడి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించి, వారి ఆదేశానుసారం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కాగా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న విభేదాల వల్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు ఆలస్యం అవుతుందని, దీంతో రైతులు నష్టపోతారని పలువురు ఆవేదన చెందుతున్నారు.



కొనుగోలు కేంద్ర ఏర్పాటుపై చర్చిస్తున్న అధికారులు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

వనపర్తి టౌన్: దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే తిరుగుబాటే శరణ్యమని బ్రిటిషర్లపై తిరుగుబాటు చేసిన పోరాటయోధుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. మంగళవారం సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, భారతదేశ స్వేచ్ఛ కోసం చిన్నతనంలోనే ఎన్నో పోరాటాలు చేసిన సీతారామరాజు పోరాటాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, దేవన్ననాయుడు, గంధం నాగరాజు, బాలస్వామి నాయుడు, పరమేశ్వరచారి, మురళీధర్ చారి, మాధవచారి, సత్యంచారి, రమేష్ చారి, వేణు చారి, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులపై అవగాహన

పాన్‌గల్: ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(పీఎంజేఏవై) హెల్త్ కార్డులపై గ్రామాల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ వీటిని పొందే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డులను తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని, టీబీ వ్యాధి నివారణ, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో తీసుకునేలా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సేవల విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



అమరచింతలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండన్న



పెబ్బేరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

అమరచింత/ఆత్మకూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పని చేసి, ప్రజలకు మోదీ సారథ్యంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. అమరచింత, ఆత్మకూర్ మండల కేంద్రాల్లో బీజేపీ బూత్ లెవల్ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచం గుర్తించేలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మోదీకి మరోసారి ప్రధానిగా అవకాశం కల్పించాలని కోరారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 10న నారాయణపేటలో జరిగే సభలో ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతున్నారని వెల్లడించారు. సమావేశానికి కార్యకర్తలు, నాయకులు పెద్దెత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, నరాల నారాయణ, మరాఠి అశోక్‌కుమార్, హరీష్, క్యామ భాస్కర్, అశ్వినికుమార్, సురేష్, శివశంకర్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రజల్లో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తూన్నారని మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పెబ్బేరు పట్టణ కేంద్రంలోని పీజేపీ క్యాంప్‌లో మార్నింగ్ వాక్‌లో పాల్గొని బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని, మోదీ సారథ్యంలో ఎన్నో సంక్షేమ పథకాలు పేదల తలుపు తట్టాయని తెలిపారు. కార్యక్రమంలో గొని వేమారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాన్‌గల్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా నాయకులు మంగళవారం మండలంలోని కేతేపల్లిలో ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ అన్వేష్ మాట్లాడుతూ దేశ రక్షణ నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని, దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే మరోసారి మోదీ విజయం సాధించాలన్నారు.

'ఆగస్టు వరకు రూ.2 లక్షల రుణమాఫీ'



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మేఘారెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ఆగస్టు 15వ తేదీ లోపు రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, మల్లురవి తనయుడు మల్లు సిద్దార్థ, మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ తెలిపారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీదర్‌రెడ్డికి మద్దతుగా వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు పూర్తి కాగానే వనపర్తి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. గ్రామ సభల్లోనే తీర్మానం చేసి పార్టీలకతీతంగా ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తామన్నారు. గతంలోనే బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేసి మోసపోయామని, మరోసారి మాయమాటలు చెప్పి ఓట్లు అడిగే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజుద్దీన్, వైస్ చైర్మన్ ఖలీద్ సైసుర్ల, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్‌లు బ్రహ్మం, నక్క రాములు, సత్యం, విజయకుమార్, మురళీధర్‌రెడ్డి, క్యామ వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, కౌన్సిలర్ మాధవి, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, నల్గొండ శ్రీను, పి.కృష్ణారెడ్డి, గొల్లబాబు, రాంమోహన్‌రెడ్డి, పి.మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, లతీఫ్, శివకుమార్‌రెడ్డి, కైసర్, భాస్కర్‌రెడ్డి, వహీద్, పి.మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో..



పుల్గర్‌చర్లలో..



మూలమళ్లలో..

కేసీఆర్ పాలనలో అభివృద్ధి పరుగులు

ఖిల్లాఘనపురం: అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ సింగిరెడ్డి ప్రత్యూష అన్నారు. మంగళవారం మండల సమన్వయ కర్త నందిమళ్ల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి పురేందర్‌రెడ్డితో కలిసి ఆమె మండలంలోని పర్వతాపురం, మామిడిమాడ, సల్కెలాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ప్రచారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కేసీఆర్ హయాంలో రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ చారి, రంగారెడ్డి, మల్లారెడ్డి, జనార్దన్, అమరేందర్, శరత్, సురేందర్, రవి, వెంకటయ్య, బుచ్చిరెడ్డి, శ్వేత, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు నిధులు అధికంగా మంజూరు చేసుకునే అవకాశం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మాజీ రాజేందర్‌సింగ్ అన్నారు. పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజావళి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నరసింహులు గౌడ్, ఉపాధ్యక్షుడు బాలరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సల్కెలాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రత్యూష



అమరచింతలో..

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు తగరం లక్ష్మి మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విజయం సాధిస్తే నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి వేగంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డేగ శేఖర్, తగరం నరసింహ, బాలకిష్టి, గోపాల్, క్రాంతి, రాజశేఖర్‌రెడ్డి, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని వడ్డె కాలనీలో బీఆర్ఎస్ నాయకులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ శావణ్‌కుమార్‌రెడ్డి, చాంద్ పాష, గన్నెపల్లి పనోజ్‌కుమార్, సంజ నాగరాజు, మ్యాతర్ల అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

3 ఇసుక టాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన ముగ్గురు ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా తూంకుంట ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకొని పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు. అక్రమ ఇసుక తరలింపునకు పాల్పడ్డ వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి పలువురి రాజీనామా

అమరచింత: బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పదవులకు రాజీనామా చేస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు మహిపాల్‌తో పాటు 15మంది నాయకులు తెలిపారు. పదేళ్లుగా పార్టీలో చురుకుగా పనిచేస్తున్న తమను కాదని మండలం మొత్తంలో నలుగురు వ్యక్తులకే ప్రాధాన్యత ఇస్తూ కష్టపడిన వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ఈవిషయాన్ని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అంతే కాకుండా దళితబంధు, బీసీ బంధు, ఇతర పథకాల మంజూరు వ్యవహారంలో లబ్ధిదారులను నుంచి డబ్బులు వసూలు చేస్తు అర్హులను విస్మరించారని, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చలేదని దుయ్యబట్టారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బిజినేపల్లి: రైతు భరోసా పథకం కింద ఐదు ఎకరాలకు పైన ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మిద్దె రాములు, కత్తె ఈశ్వర్, చంద్రగౌడ్ బంగారయ్య, గోవింద్‌నాయక్, ఎర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



ఆత్మకూర్‌లో ప్రచారం చేస్తున్న విజయరాములు

ఆత్మకూర్: ప్రపంచ దేశాలు మెచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆవిష్కరించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతో పాటు బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా సీపీఐ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలో విభజించు పాలించు అనే చందంగా మోదీ పాలన కొనసాగుతుందని దుయ్యబట్టారు. రైతులను, కార్మికులను, ప్రజలను పక్కనబెట్టి అదానీ, అంబానీలకు రెడ్‌కార్పెట్ పరుస్తూ రూ.లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రజల సొమ్మును లూటీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, మండల కార్యదర్శి రాబర్ట్, నాయకులు రవీందర్, కుతుబ్, నర్సింహాశెట్టి, మల్లేష్, ఖాజపీర్, రఫీఖ్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: పేదలకు అధిక ధరల భారం మోపిన బీజేపీని గద్దె దించాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోపాలకృష్ణ కోరారు. ఆయన మంగళవారం ఇందిరాకాలనీ, గాంధీనగర్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా సీపీఐ పట్టణ కమిటీ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, చంద్రయ్య, చిన్న కురుమయ్య, నరేష్, విష్ణు, చంద్రశేఖర్, అశోక్, వెంకటమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మతోన్మాద నినాదంతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యం గెలిపించుకుందామని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, లక్ష్మీనారాయణశెట్టి, మల్లేష్, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..

సీపీఎం ఆధ్వర్యంలో..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పట్టణంలో మంగళవారం సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, వెంకటేష్, చంటి, రమేష్, కాకి శ్రీను పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని 21, 22వ వార్డుల్లో సీపీఎం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, గంధం మదన్, గట్టయ్య, మన్యం, రాములు, బీసన్న పురుషోత్తం, బాలరాజు, శేషయ్య, మన్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి

పాన్‌గల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతకుంటకు చెందిన సంగనమోని కృష్ణయ్య గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలోకి గేదెను మేతకు తీసుకెళ్లాడు. సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి గేదె మృతి చెందినట్లు రైతు పేర్కొన్నాడు. దీని విలువ దాదాపుగా రూ.50 వేలు ఉంటుందన్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.